

బుగ్గరామలింగేశ్వర స్వామి సన్నిధానంలో భక్తుల కిటకిట



ఆలయ ఆవరణలో వ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు

# మార్మోగిన శివనామస్మరణ

■ రామలింగేశ్వర స్వామి జాతరకు పోటెత్తిన భక్తులు ■ కొనసాగుతున్న కార్తిక మాస ఉత్సవాలు
■ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ■ కార్తిక దీపాలను వెలిగించిన భక్తులు

మంచాల, డిసెంబర్ 3 : బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. కాశీ తర్వాత మరో పుణ్య క్షేత్రమైన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామ సమీపంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఏడో రోజు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఇక్కడికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వ్రతాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న తర్వాత ఆలయ సమీపంలో ఉన్న తులసి కోట వద్ద కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి సమీపంలో ఉన్న నాగన్న పుట్ట, కబీర్‌దాస్ మందిరాన్ని దర్శించుకుని కుటుంబ సమేతంగా వన భోజనాలు చేసి తిరిగి గ్రామాలకు వెళ్లారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న మహిళలు, చిన్నారులు

# 166 టేబుళ్లు..172 రౌండ్లు



■ ఫలితం తేలింది.. ఉత్కంఠత వీడింది
■ మూడు చోట్ల ప్రశాంతంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ
■ కౌంటింగ్‌లో పాల్గొన్న 900 మంది సిబ్బంది
■ ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

**నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్లు, రౌండ్ల వివరాలు**

| నియోజకవర్గం | టేబుళ్లు | రౌండ్స్ |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 14 | 25 |
| చేవెళ్ల | 14 | 22 |
| షాద్‌నగర్ | 12 | 22 |
| మహేశ్వరం | 28 | 20 |
| శేరిలింగంపలి | 28 | 23 |
| ఎల్బీనగర్ | 28 | 21 |
| రాజెంద్రనగర్ | 28 | 20 |
| కల్వకుర్తి | 14 | 19 |

రంగారెడ్డి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ముగిసింది. రంగారెడ్డి జిల్లాలోని 8 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడడంతో ఉత్కంఠకు తెరపడింది. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 209 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 21,11,204 మంది ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని నేడు తేల్చారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో, ఎల్బీనగర్ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, శేరిలింగంపల్లి ఓట్లను గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో, రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును అప్పా జంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో చేపట్టారు. సీసీ కెమెరాల నిఘా... మూడంచెల భద్రత నడుమ పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. 290 మంది సూపర్‌వైజర్లు, 331 మంది అసిస్టెంట్స్, 279 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధులను నిర్వర్తించగా.. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలైంది. మొత్తం 166 టేబుళ్లపై నిర్వహించిన కౌంటింగ్ ప్రక్రియను 172 రౌండ్లలో తేల్చారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

# కాలె యాదయ్య గెలుపుతో సంబురాలు



మొయినాబాద్ : అజీజ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, డిసెంబర్ 3 : బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య గెలుపు ఎంతో ఉత్కంఠ భరితంగా మారింది. మొయినాబాద్, షాబాద్, చేవెళ్ల మండలాల ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ ఆధిక్యంలో కొనసాగగా.. నవాబుపేట, శంకర్‌పల్లి మండలాలకు సంబంధించి కాలె యాదయ్య ఆధిక్యంలో కొనసాగారు. చివరకు చేవెళ్ల లోని కొన్ని బూతుల్లో సంబంధించి యాదయ్యకు మెజార్టీ రాగా.. 268 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలకు సిద్ధమయ్యారు. అంతలోనే స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైన భీం భరత్ మళ్లీ రీకౌంటింగ్ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అనుమానం ఉన్న బూతుల్లో రీకౌంటింగ్ చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. అనంతరం గ్రామంలో రాత్రి 8 గంటలకు బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాలె యాద య్య కౌంటింగ్ కేంద్రం నుంచి ఆర్మీ మై సమ్మ అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి మొయినాబాద్‌కు చేరుకున్నారు. అజీజ్‌నగర్ గ్రామంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన అం బేద్కర్ విగ్రహానికి, హిమాయత్‌నగర్ గ్రా మంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రా మ్ విగ్రహాలకు, మొయినాబాద్‌లోని మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. మొయినాబాద్‌కు చేరుకోగానే బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. జై యాదన్న, చేవెళ్ల గడ్డ యాదన్న అడ్డ అని నినాదాలు చేశారు.

**శంకర్‌పల్లి :** చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలె యాదయ్య గెలుపొందడంతో మున్సిపాలిటీ, మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజూనాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, సర్పంచ్ రవీందర్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, రవినాయక్, వెంకటేశ్ ఉన్నారు.




శంకర్‌పల్లి : జనవాడలో సంబురాలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# శ్రీకాంతాచారి బలిదానం మరువలేం

కడ్తాల్, డిసెంబర్ 3 : తెలంగాణ మలి దశ ఉద్యమంలో శ్రీకాంతాచారి బలిదానం మరువలేనిదని యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. ఆదివారం మండల కేం ద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంతాచారి మరణం త ర్వాత తెలంగాణ ఉద్యమం తీవ్రతరం అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు కృష్ణయ్య, కురుమ యువ చైతన్య సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, అశోక్, అనిల్, అహ్మద్ పాల్గొన్నారు



కడ్తాల్‌లో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు